# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

గురువారం | 07 మే, 2026 | పేజీలు :08




## బాలల హక్కులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

### చిన్నారులు సమాజానికి బలమైన మూల స్తంభాలు
### రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి

**ప్రజాపక్షం/మెదక్ :** బాలల హక్కులను కాల రాస్తే ఉపేక్షించబోమని, కఠిన చర్యలు తీసుకుంటామని, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ సీతా దయాకర్ రెడ్డి హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన సమీక్ష సమావేశంలో మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి జిల్లాల అధికారులతో సీతా దయాకర్ రెడ్డి బాలకార్మికత్వం, బాల్యవివాహాలు, డ్రగ్స్ నియంత్రణ, విద్యా అవగాహన, పాఠశాల డ్రాప్‌ఓట్‌లు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలలు సురక్షితంగా, ఆరోగ్యంగా, గౌరవప్రదంగా ఎదగడానికి అవసరమైన అన్ని హక్కులను కాపాడటం ప్రభుత్వంతో పాటు సమాజం మొత్తం భాధ్యత అన్నారు. బాలలపై దౌర్జన్యాలు, హక్కుల ఉల్లంఘున ఎక్కడ జరిగినా కఠిన చర్యలు తీసుకంటామని హెచ్చరించారు. చిన్నారులు మన సమజానికి భవిష్యత్తు బలమైన స్థంభాలన్నారు. వారి శారీరక, మానసిక, భావోద్వేగ వికాసానికి అనుకూల వాతావరణం కల్పించడం అత్యవసరమని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ బాలల భద్రత కోసం ఆకస్మిక తనిఖీలు చేపట్టి, రక్షణ చర్యలను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లు, తరువాయి 2లో...

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా, పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు గోదామును పరిశీలించారు. గోదాములో ధాన్యపు డంపింగ్ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లారీలలో వచ్చిన ధాన్యపు సంచులను ఎప్పటికప్పుడు భద్రంగా నిల్వ చేయాలన్నారు. క్కువ మంది హమాలీలను నియమించుకొని వెంట వెంటనే ధన్యాపు సంచుల డంపింగ్ ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇప్పటివరకు నిల్వ చేసిన ధాన్యపు సంచుల వివరాలు అన్‌లోడింగ్ కు వరుసలో సిద్దంగా ఉన్న లారీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమీపంలోనే ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌ సరఫరాల అధికారి, మేనేజర్‌లు రాజేందర్, సుధాకర్‌లు, తహసిల్దార్ రాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ భీం రెడ్డి ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యపు సంచులను భద్రంగా నిల్వ చేయాలి : కలెక్టర్ భవేష్ మిశ్రా





## యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం

### డేటా సైన్స్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా రంగాల్లో శిక్షణ లభ్యం
### పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాల పెంపు – టాస్క్ కేంద్రం లక్ష్యం
### మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/ముత్తారం :** యువత నైపుణ్యాభివృద్ధితోనే తెలంగాణ 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యమవుతుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. బుధవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్షలతో కలిసి మంథనిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ యువతకు ఆధునిక సాంకేతిక నైపుణ్యాలను అందించి ఉపాధి అవకాశాలను పెంపొందించాలనే లక్ష్యంతో టాస్క్ ఆధ్వర్యంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కేంద్రం ద్వారా డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మల్టీమీడియా, ఆడియో విజువల్ రంగాల్లో శిక్షణ అందించబడుతుందని పేర్కొన్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (CSR) కార్యక్రమంలో భాగంగా Ctrl S డేటా సెంటర్ సంస్థ సహకారంతో యువతకు నైపుణ్య శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంథని వంటి ప్రాంతాలకు పరిశ్రమలను తీసుకురావడం సవాలుతో కూడుకున్నదని, ఇక్కడి తరువాయి 2లో..

## తహసీల్దార్ కార్యాలయం వెనుక ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం



**ప్రజాపక్షం/జన్నారం :** జన్నారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక ఉన్న ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపట్టడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నెంబర్ 374లో గల ఐదు ఎకరాల ఎనిమిది గుంటల భూమి కబ్జాకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. గతంలో మండల కేంద్రంలో స్థలం లేకపోవడం వల్ల మోడల్ స్కూల్ దండేపల్లి మండలం లింగాపూర్‌కు తరలిపోయిందని, ఐటిఐ కళాశాలను కూడా కిష్టాపూర్‌లో ఏర్పాటు చేయాల్సి వచ్చిందని పేర్కొన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి కూడా స్థలం తరువాయి 2లో..

### ఐఐటి బీ ఆర్క్, బి ప్లానింగ్ ఫలితాలలో
## ఆల్ఫోర్స్‌కు అద్భుత ర్యాంకులు



# బాలల హక్కులు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

బాలల సంరక్షణ గృహాలు, అనాథాశ్రామాలు వంటి ప్రదేశాల్లో అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహిస్తూ, చిన్నారుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నామని వెల్లడించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతీ ఒక్కరూ బాలల హక్కుల పరిరక్షణలో కీలక పాత్ర పోషించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కులు పరిరక్షణ కమిటీ సభ్యులు వందనా గౌడ్, చందన, సరిత, అపర్ణ, అగర్వాల్, వచన్ కుమార్ సిద్దిపేట డిఆర్ఓ నాగరాజమ్మ, మెదక్ అడిషనల్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ సిద్దిపేట అడిషనల్ ఎస్పీ ఉమ్మడి జిల్లా అధికారులు పాల్గోన్నారు.

# ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నం

(మొదటిపేజీ తరువాయి)

దొరకలేదని గుర్తు చేస్తున్నారు. భవిష్యత్తు అవసరాల కోసం ఉన్న ఈ ఒక్క స్థలాన్ని కాపాడాలని అంబేద్కర్ సంఘం జిల్లా నాయకుడు ముల్కల ప్రభాకర్ గతంలో కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్ బక్కన్నను వివరణ కోరగా.. అక్రమ నిర్మాణాలను నిలిపివేయించామని, మూడు రోజుల్లో విచారణ జరిపి ప్రభుత్వ స్థలమని తేలితే కూల్చివేస్తామని తెలిపారు. ఇక్కడ పాల్గొన్న వారిలో ముల్కల ప్రభాకర్, స్థానిక ప్రజలు ఉన్నారు.

# ఇబ్రహీంపట్నం సింగిల్ విండో చైర్మన్‌గా జిల్లాల పవన్



ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని సింగిల్ విండో చైర్మన్‌గా జిల్లాల పవన్ నియమితులయ్యారు. ఇంతకు ముందు వైస్ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వహించిన పవన్ బుధవారం తాజాగా చైర్మన్ బాధ్యతలను విండో కార్యాలయంలో స్వీకరించారు.ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ రైతులకు అన్ని విధాల అండగా ఉంటూ సహకార సంఘ అభివృద్ధికి పాలకవర్గం సభ్యులతో కలిసి కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పవన్‌ను స్థానిక సర్పంచ్ బద్దం గోపి, ఉప సర్పంచ్ నాంపల్లి రమేష్, విండో డైరెక్టర్లు రవి కాంత్, ఎలిసె రాజు, ఇట్టేడి రామ్ రెడ్డి, ఎలుక అశోక్, విండో సీఈవో మంత్రి సతీష్, నాయకులు గూడ పాపన్న,గూడ రామ్ రెడ్డి, కుంభాల జీవన్ రెడ్డి, నేమూరీ సత్యనారాయణ, జెడి సుమన్, బడికింటి ముత్తన్న, బొమ్మెన గణేష్, నేమూరీ నరేష్, తీగల రమేష్ పడాల రాజేందర్,వొద్దే రాజు, సిబ్బంది, తదితరులు కలిసి అభినందించారు.

# 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ సాధ్యం

(మొదటి పేజీ తరువాయి)

యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేందుకు టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, దీనిని సాధించడానికి యువతలో నైపుణ్యాలను పెంపొందించడం ఒక్కటే మార్గమని స్పష్టం చేశారు.మన విద్యార్థులకు మంచి అకడమిక్ పరిజ్ఞానం ఉన్నప్పటికీ పరిశ్రమలకు అవసరమైన కొన్ని నైపుణ్యాలలో లోపాలు ఉన్నాయని, వాటిని అధిగమించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని తెలిపారు. మంథనిలోని టాస్క్ కేంద్రం కూడా ఇదే విధంగా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను యువతలో పెంపొందించి వారికి ఉద్యోగాలకు సిద్ధం చేస్తుందని వివరించారు. టాస్క్‌లో నమోదు చేసుకుని పలు శిక్షణ కోర్సులు పూర్తి చేసిన అనేక మంది విద్యార్థులు మల్టీనేషనల్ కంపెనీల్లో మంచి వేతనాలతో ఉద్యోగాలు సాధించారని తెలిపారు. ఇక్కడ మంచి కంపెనీలు శిక్షణ అందించేందుకు సిద్ధంగా ఉన్నాయని, యువత ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం జేఎన్టీయూ మంథనిని ఈ ప్రాంతానికి తీసుకువచ్చిందని, ప్రతి విద్యార్థి భవిష్యత్తు తన బాధ్యతగా భావిస్తున్నానని, క్రమశిక్షణతో శిక్షణ పొందాలని సూచించారు. అలాగే మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించినట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు స్వయం ఉపాధి పొందగలరని అన్నారు. గంగాపురిలో రూ.7.3 కోట్ల వ్యయంతో ప్లగ్ అండ్ ప్లే గార్మెంట్స్ యూనిట్‌కు ఈరోజు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత ఒకేసారి 400 మంది మహిళలకు శిక్షణ అందించవచ్చని, ఇది విజయవంతమైతే మరో యూనిట్‌ను కూడా ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి నిరుద్యోగ యువకుడు కష్టపడే మనస్తత్వాన్ని కలిగి ఉండాలని, కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలు సాధ్యమవుతాయని గుర్తుంచుకోవాలని సూచించారు. మంథని పట్టణానికి అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలతో కూడిన శిక్షణ కేంద్రాలను తీసుకురావడమే లక్ష్యంగా టాస్క్ అడ్వాన్స్‌డ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వేగంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో అనేక ఉద్యోగాలు మార్పులకు లోనవుతున్నాయని, మార్కెట్లో నిలదొక్కుకోవాలంటే యువత తప్పనిసరిగా AI వంటి ఆధునిక నైపుణ్యాలను అభ్యసిస్తూ కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సూచించారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించేందుకు ఈ టాస్క్ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకుని నైపుణ్యాభివృద్ధి ద్వారా ఉపాధి అవకాశాలను పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సురేష్, మున్సిపల్ చైర్మన్ వి.శ్రీనివాస్, మినిమమ్ వేజెస్ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్, టాస్క్ చైర్మన్ నితిన్ కుమార్ రెడ్డి, కంట్రోల్ ఎస్ డేటా సెంటర్ సంస్థ డైరెక్టర్ రాజీవ్ త్రీవేది,ఏఎంసీ చైర్మన్ కె. వెంకన్న, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు,విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.

# వర్షం, వరదకు కొట్టుకుపోయిన ధాన్యం

## దుఃఖ సంద్రంలో రైతులు



ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి, సందరెల్లి తదితర గ్రామాల్లో మంగళవారం రాత్రి ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ అకాల వర్షం వరి పండించిన రైతులకు కోలుకోలేని దెబ్బ తీసింది.కొనుగోలు కేంద్రాలకు తరలించి ఆరబోసిన వరి ధాన్యం అకాల వర్షానికి పూర్తిగా తడిసి ముద్దయింది. తార్పాలిన్ కవర్లు కప్పినా, ఈదురుగాలుల ధాటికి అవి ఎగిరిపోవడంతో ధాన్యం తడవడమే కాకుండా కొన్ని చోట్ల వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట, చేతికొచ్చే సమయంలో నీటిపాలవ్వడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ జాప్యం కారణంగానే ఈ పరిస్థితి వచ్చిందని, మూడు నెలల కష్టం కళ్లముందే నాశనమవుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయకపోతే అవి మొలకెత్తే అవకాశం ఉందని, రంగు మారి నాణ్యత తగ్గుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి నిబంధనలు (తేమ శాతం వంటివి) లేకుండా ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని, నష్టపోయిన తమను ఆదుకోవాలని వివిధ గ్రామాల రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# వ్యవసాయ మార్కెటింగ్ సదుపాయాలు ఉపయోగించుకోవాలి

## జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి



ప్రజాపక్షం/కరీంనగర్ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకొని బుధవారం వ్యవసాయ మార్కెట్ కమిటీ, కరీంనగర్ లో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకుల ద్వారా దీర్ఘకాలిక, స్వల్పకాలిక పంట రుణాలు, సహకార సంఘాలు, ఎఫ్.పి.ఓల ద్వారా రైతులకు అందిస్తున్న సేవలు, అలాగే వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ అవకాశాలు వంటి అంశాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్టేట్ అబ్జర్వర్ పి.ఈశ్వరయ్య రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ, రైతులు ప్రభుత్వం అందిస్తున్న రుణ సదుపాయాలు, సబ్సిడీ పథకాలు, మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు సహకార సంఘాలు, ఎఫ్.పి.ఓలలో సభ్యత్వం పొందడం ద్వారా ఉత్పత్తుల విక్రయంలో మెరుగైన ధరలు పొందవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి జె.భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రైతులు వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, మార్కెట్ యార్డుల సేవలు, గిడ్డంగి సదుపాయాలు, రైతు బజార్లు మరియు ఈమార్కెటింగ్ అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. రైతులు తమ ఉత్పత్తులను సరైన వేదికల ద్వారా విక్రయించడం ద్వారా గిట్టుబాటు ధర పొందవచ్చని పేర్కొన్నారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి కమలాకర్ రెడ్డి ఉద్యాన పంటల సాగులో ఆధునిక సాంకేతిక పద్ధతులు, డ్రిప్ ఇరిగేషన్, మల్చింగ్, ప్రభుత్వ ప్రోత్సాహకాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా కోఆపరేటివ్ అధికారి రామానుజాచార్యులు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్న రుణ సదుపాయాలు, విత్తనాలు, ఎరువుల పంపిణీ, ఇతర సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా మార్కెటింగ్ అధికారి షాబుద్దీన్ మాట్లాడుతూ, రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ యార్డులు, రైతు బజార్లు మరియు ఎఫ్‌పిఓల ద్వారా విక్రయించి మెరుగైన ధరలు పొందవచ్చని తెలిపారు. మార్కెటింగ్ శాఖ అమలు చేస్తున్న పథకాలపై రైతులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు రణధీర్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఆధునిక సాగు పద్ధతులతో పాటు మార్కెటింగ్ అంశాలపై అవగాహన పెంపొందించుకొని ఆర్థికంగా లాభపడే విధంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెడిసిసి బ్యాంకు ఏజిఎం నాగరాజు, ఎఫ్‌పిఓ చైర్మన్ శంకరయ్య, మండల వ్యవసాయ అధికారులు, సత్యం, వంశీకృష్ణ, సంతోష్ కుమార్, ఇతర బ్యాంకు ప్రతినిధులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# ఆల్ఫోర్స్‌కు అద్భుత ర్యాంకులు

ప్రజాపక్షం/కరీంనగర్ : ఐఐటి బీ ఆర్క్, బి ప్లానింగ్ ఫలితాలలో అల్ఫోర్స్ విద్యార్థులు అద్భుత ర్యాంకులు సాధించినట్లు ఆల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత డా॥ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. B.Arch లో ఎస్.శ్రీహిత 174వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, పటేల్ అక్షయ 189వ ర్యాంకు, డి.తనుశ్రీ 227వ ర్యాంకు, వి.రితిక 287వ ర్యాంకు, ఎస్.ఆధ్య 319వ ర్యాంకు, టి.వెంకట నిహిత్ 903వ ర్యాంకు, సి.హెచ్. భీమ 1107వ ర్యాంకు, ఆర్.నేహగాయత్రి 1719వ ర్యాంకు, పి.శ్రీనిధి 1776వ ర్యాంకు, పి.హర్షిణి 2325వ ర్యాంకు, ఉమైరా సన్నున్ 2626వ ర్యాంకు, పి.అక్షయప్రియ 2786వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేశారని అన్నారు. B.Planningలో వి.ప్రణతి 858వ ర్యాంకు, పి.క్రిష 1281వ ర్యాంకు, ఎమ్.వివేక్ రెడ్డి 1554 వ ర్యాంకు, ఎమ్.షాలిని 1757వ ర్యాంకు, రహీన్ ఉమేద 2448వ ర్యాంకు, జి.మహాలక్ష్మి 3053వ ర్యాంకు, పి.ఆదిత్యలక్ష్మి 3122వ ర్యాంకులు సాధించారు. రాబోయే ఐఐటి (Adv) పరీక్ష వ్రాయుటకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందముచే కోచింగ్ ఇస్తున్నామని, పటిష్ట ప్రణాలికతో విద్యా భోధన మరియు నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల, అహర్నిషల కృషివల్ల అల్ఫోర్స్ ఇంతటి ఘన విజయం సాధించగలిగిందని పేర్కొన్నారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

## జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్

ప్రజాపక్షం/సారంగాపూర్ : అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. సారంగాపూర్ మండలం కోనాపూర్ గ్రామానికి గుండా సత్తెమ్మ చిన్న మల్లయ్య ఇందిరమ్మ ఇల్లు గృహ ప్రవేశం కార్యక్రమానికి హజరైయ్యారు. ఆర్పపల్లి గ్రామానికి చెందిన మామిడిపల్లి జయ గంగాచారి, కుడుకల జలజ రాజా లింగారెడ్డి ఇందిరమ్మ ఇళ్లు గృహ ప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ హజరై ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించి చీర కానుకగా అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సలీం, ఎస్సై గీత, సర్పంచులు సొల్లు సురేందర్, బాస మహేష్, కొలపాక రాధ రాజు, శేఖర్, మాధవి బాపిరాజు, అశ్విని రమేష్, నాయకులు శ్రీనివాస్, రాజేందర్ రెడ్డి, మనోహర్ రెడ్డి, మల్లారెడ్డి, మల్లేష్, రెడ్డి, లక్ష్మణ్, గోపాల్, రాజేందర్, తిరుపతి రెడ్డి, మాణిక్య రావు, నాంపల్లి, చిన్నారెడ్డి వార్డు సభ్యులు, గ్రామ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ కమిటీ సమావేశం




ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం : ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారోత్సవాలను పురస్కరించుకుని జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎలాల వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రైతు బంధు, రైతు భీమా, కొనుగోలు కేంద్రాలకు పరికరాల పంపిణీ వంటి కార్యక్రమాలపై రైతులకు వివరించారు.అనంతరం రైతులను శాలువాలతో ఆయన సన్మానించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి నీరటి సురేందర్, సభ్యులు రాగుల గణేష్, దామెర శ్రీనివాస్, బూస రాజేశ్వర్, గుమ్మల రమేష్ తదితరులు, రైతులు పాల్గొన్నారు.

# రేచపల్లిలో ధాన్యం కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

ప్రజాపక్షం/సారంగాపూర్ : జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం రేచపల్లి గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ బిఎస్ లత పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రాల నిర్వహణ, ధాన్యం తూకం విధానం, రైతులకు అందుతున్న సౌకర్యాలపై ఆమె సమీక్ష నిర్వహించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా వేగంగా కొనసాగించాలని అదనపు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో వాహిదోద్దీన్, గ్రామ సర్పంచ్ బాస మహేష్, ఆర్ఐ వెంకటేష్, జిపివో మల్లేష్, గ్రామ కార్యదర్శి సంతోష్, కారోబార్ రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ అంటేనే రైతుల ప్రభుత్వం

**ప్రజాపక్షం/మల్లాపూర్ :** కాంగ్రెస్ అంటేనే రైతుల ప్రభుత్వమని మల్లాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంతడుపుల పుష్పలత అన్నారు.ఈ మేరకు గురువారం రోజున ఏఎంసీ కార్యాలయంలో ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక రైతు వారం కార్యక్రమాన్ని మల్లాపూర్ పిఏసిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పిఏసిఎస్ సీఈవో పాదం భూమేష్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రణాళిక 99వ రోజుల్లో భాగంగా రైతు వారంకు సంబంధించి వివరాలను సభ్యులకు వివరించి మాట్లాడారు. అనంతరం పలు రైతులను పిఏసిఎస్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్, సొసైటీ సీఈఓ భూమేష్, నాయకులు జలపతి రెడ్డి, ఉప సర్పంచ్ సోమారెడ్డి, నరసయ్య,తదితరులున్నారు.

## కోర్టు తీర్పుతో పిఏసిఎస్ లకు పూర్వ వైభవం

**ప్రజాపక్షం /మల్లాపూర్ :** ప్రభుత్వం రద్దు చేసిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పాలకవర్గాలను తిరిగి కొనసాగించాలని హైకోర్టు తీర్పునివ్వగా గురువారం సిర్పూర్ పిఏసిఎస్ చైర్మన్గా బద్దం అంజిరెడ్డి, పాలకవర్గ సభ్యులు బాధ్యతలను చేపట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ అంజిరెడ్డి మాట్లాడుతూ హైకోర్టు తీర్పుతో సహకార సంఘాలకు పూర్వ వైభవం వచ్చిందని, రైతులకు అవసరమయ్యే సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి మామిడి రాజేశ్వర్ రెడ్డి, పాలకవర్గ సభ్యులు ఉన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ఖమ్మంపల్లి గ్రామ ంలో ఉపాధి హామీ కూలీలకు సర్పంచ్ నక్క రాజేశ్వరి రాజయ్య,ఉపసర్పంచ్ కారుకూరి సతీష్,గ్రామ పంచాయతీ కార్యదర్శి బద్రు నాయక్ ఆధ్వర్యంలో మజ్జిగ ప్యా కె ట్లు అందజేశారు. ఈ సందర్భంగా సర్పం చ్ నక్క రాజేశ్వరి రాజయ్య మాట్లాడుతూ ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉన్నాయని, పనుల కోసం వచ్చే కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉ పాధి పనులు చేసే ప్రదేశాల్లో నీడ సౌకర్యం కల్పించడంతో పాటు, కూలీల ఆరోగ్యం దృష్ట్యా సిబ్బంది తీసుకున్న ఈ చొరవపై ఉపాధి కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

## చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

**ప్రజాపక్షం/ముత్తారం :**పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ సబ్ సెంటర్ పరిధిలో బుధవారం చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఏఎన్ఎం సునీత ఆ ధ్వర్యంలో ని ర్వహించిన ఈ కార్యక్రమం లో 62 రో జుల పసిబిడ్డల నుండి 16 ఏళ్ల లోపు పిల్లల వరకు ఆయా వయస్సుల వారీగా వేయాల్సిన టీకాలను వేశారు. ల్లిదండ్రులు అవగాహనతో తమ పిల్లలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ఆమె కోరారు. ప్రభు త్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించడం వల్ల ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తల తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో రైతు వారం



### మార్కెట్‌కు వచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తాం

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రైతు వారం కార్యక్రమం గురువారం మార్కెట్ ఆవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కూన గోవర్ధన్ అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ కూన గోవర్ధన్ మాట్లాడుతూ రైతుల సమస్యల పరిష్కారానికి మార్కెట్ కమిటీ అన్ని విధాల సహకరిస్తుందని తెలిపారు.మార్కెట్ యార్డ్కు తీసుకొచ్చిన ప్రతి ధాన్యపు గింజను కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. రైతులు తేమలేని ధాన్యాన్ని ఇంటి వద్దనే బాగా ఆరబెట్టి మార్కెట్‌కు తీసుకురావాలని సూచించారు. తేమతో కూడిన ధాన్యం తీసుకువచ్చి రోజుల తరబడి మార్కెట్లో వేచి ఉండవద్దని తెలిపారు.మార్కెట్కు వచ్చే రైతులకు ఏ సమస్య వచ్చినా నేరుగా తమను సంప్రదించాలని,సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పుల్లూరి నవీన్,సంగు గంగాధర్, కార్యదర్శి ఇంద్రసేనారెడ్డి,వ్యాపారస్తులు హరికృష్ణ, సతీష్, నిమ్మల భూమారెడ్డి,పుప్పాల చిన్న అంజయ్యతో పాటు రైతులు, వ్యాపారస్తులు,హమాలీలు,చాట కార్మికులు. మార్కెట్ సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం

# ప్రారంభించి ఇరవై రోజులైనా గింజా కొనలే

### అనంతారం గ్రామ రైతులు బిట్లో వడ్లు పోసి 20 రోజులు అవుతుంది



జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** జగిత్యాల రూరల్ మండలం అనంతారం గ్రామంలోని ఐకెపి వరి ధాన్య కొనుగోలు సెంటర్ ను బుధవారం జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ పరిశీలించారు.పంట చేతి కొచ్చి 20 రోజులైన ధాన్యం కొనుగోలు సెంటర్ ను 15 రోజుల కింద ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ ప్రారంభించిన కూడా ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని దావ వసంత అన్నారు.రైతులంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఆమె అన్నారు. ఎన్నికల సమయంలో రైతు డిక్లరేషన్ పేరిట పెద్దపెద్ద మోసపూరిత మాటలు చెప్పి ఇప్పుడు కనీసం రైతు పండించిన పంట కొనుగోలు చేయలేని స్థితిలో ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది అని దావ వసంత అన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే కొనుగోలు ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అయిల్నేని ఆనంద్ రావు, మోహన్, శ్రీపాల్, జలంధర్, రాజమల్లు, మల్లేశం, గంగాధర్,తిరుపతి, సత్తన్న, భాగ్య, మల్లయ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# 2003 డిఎస్‌సి వారికి పాత పెన్షన్ విధానం వర్తింపు



ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జుట్టు గజేందర్

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** గత 21 సంవత్సరాలుగా పాత పెన్షన్ సాధన కోసం శత విధాలుగా ప్రయత్నాలు చేస్తున్న డీఎస్సీ 2003 ఉపాధ్యాయులు అతి త్వరలోనే శుభవార్త వినబోతున్నారని ఎస్‌టియుటిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ అన్నారు. బుధవారం రోజున పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ఐఎంఎ భవన్లో ఎస్‌టియుటిఎస్ పెద్దపల్లి జిల్లా శాఖ అధ్యక్షులు నడిపెల్లి సంతోష్ అధ్యక్షతన జరిగిన ఎస్‌టియుటిఎస్ పెద్దపల్లి జిల్లా ద్వితీయ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ 01.09.2004 కు ముందు వచ్చిన నోటిఫికేషన్ల ద్వారా నియామకమైన ఉద్యోగ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం మెమో 57/4 & 57/5 ప్రకారం పాత పెన్షన్ విధానం వర్తింపజేయుటకు టిజిఇజెఎసి ద్వారా ఎస్‌టియు చేసిన ఒత్తిడి ఫలితంగా ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క సమావేశంలో సూత్రప్రాయ అంగీకారం కుదిరిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని అన్నారు. చీఫ్ సెక్రటరీ తో మాట్లాడి వీలైనంత త్వరగా విధి విధానాలు వచ్చేలా చూస్తామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా సిపిఎస్ రద్దును ప్రకటించాలని ఉద్యోగ ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్న వేళ సిపిఎస్ రద్దు పై మరొక మారు చర్చిద్దామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఈ కార్యవర్గ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేరుగు సతీష్ ప్రవేశపెట్టిన నివేదికలోని అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించి వివిధ తీర్మానాలు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా ఆర్థిక కార్యదర్శి జి.మాధవాచారి, రాష్ట్ర కమిటీ సభ్యులు నల్ల రాజేందర్ రెడ్డి, తోటరాజు, మండల శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బోగె చంద్రశేఖర్, సుభాన్ ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# రైతులను ప్రభుత్వం నట్టేట ముంచుతోంది

### బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/ముత్తారం :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన ప్రగతి పథం పేరుతో రైతులను మోసం చేస్తోందని బిఆర్ఎస్ ముత్తారం మండల శాఖ అధ్యక్షుడు పోతుపెద్ది కిషన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం మండలంలోని ఓడెడ్ గ్రామంలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. అసలు గ్రామాల్లో ఏం అభివృద్ధి చేశారని కాంగ్రెస్ నాయకులు, ప్రభుత్వ అధికారులు పర్యటిస్తున్నారని ప్రశ్నించారు. ప్రజా పాలనలో రైతులకు ఒరిగిందేమీ లేదని,కనీసం పంట సాయం కూడా అందడం లేదని మండిపడ్డారు.ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో ఎరువుల కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొనుగోలు కేంద్రాల్లోనూ సమస్యలు వెంటాడుతున్నాయని విమర్శించారు.మరోవైపు ప్రభుత్వం యూరియా వాడకాన్ని తగ్గించి, సేంద్రియ సాగును ప్రోత్సహిస్తామని చెబుతున్నా.. దానికి కావాల్సిన జీలుగా, పెసర, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలను మాత్రం అందుబాటులో ఉంచలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు సేంద్రియ వ్యవసాయం చేయాలంటే విత్తనాలు ముందే సరఫరా చేయాలని,అధికారులను అడిగితే కేవలం ఇండెంట్ పెట్టామని సమాధానం చెబుతూ కాలయాపన చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు.తక్షణమే రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను అందుబాటులోకి తేవాలని డిమాండ్ చేశారు.

## వెల్మ కార్పొరేషన్ చైర్మన్‌గా జువ్వాడి నర్సింగరావు నియామకం

**ప్రజాపక్షం/మెట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్‌గా కోరుట్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ జువ్వాడి నర్సింగరావు నియమితులయ్యారు.ఈ సందర్భంగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఆయనకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.నియామకంపై స్పందించిన జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి తెలంగాణ రాష్ట్ర వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, వెలమ సంక్షేమం కోసం కృషి చేస్తానని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు.ఈ నియామకం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని పార్టీ నాయకులు తెలిపారు.

## అకాల వర్షాల వల్ల తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అరవ డివిజన్ జనగామ లోని ఐకేపీ కొనుగోలు కేంద్రం లో ఉన్న వరి ధాన్యం మంగళవారం రాత్రి కురిసిన వర్షాలకు తడిసి,వాన నీటిలో కొట్టుకుపోయిందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి కొట్టుకపోయిన ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు తొడుపునూరి రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన జనగామ ఐకేపీ కేంద్రం లోని వరి ధాన్యం కుప్పలను, వరద నీటిలో కొట్టుకపోయిన వరి ధాన్యాన్ని పరిశీలించి, రైతులతో కలిసి మాట్లాడుతూ ఆరు కాలం కష్టపడి పంట చేతికి వచ్చిన ధాన్యం సకాలంలో తూకం కాకపోవడం వల్ల అకాల వర్షానికి తడిసి రైతులకు నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు స్పందించి సకాలంలో ధాన్యాన్ని తూకం వేసే విధంగా చర్యలు తీసుకోవాలని, వర్షం వల్ల నష్ట పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన వారిలో సిపిఐ డివిజన్ నాయకులు అర్కుటి శ్రీనివాస్ తో పాటు రైతులు ఊదరి కనకయ్య, జనగామ మల్లేష్,జనగామ లింగయ్య,తదితరులు ఉన్నారు.

## ఏఐటియుసిపై అబద్ధపు ప్రచారాలు మానుకోవాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ఎర్రజెండా ఏఐటియుసి పై అబద్ధపు ప్రచారాలు ఇకనైనా మానుకోకుంటే సహించేది లేదని,ఏఐటియుసి పై గుమ్మడి కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, దీనిని సిపిఐ నగర సమితి తీవ్రంగా ఖండిస్తుందని సిపిఐ నగర కార్యదర్శి కే.కనకరాజ్ పేర్కొన్నారు. బుధవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో జరిగిన ప్రెస్ మీట్ లో ఆయన పాల్గొని మాట్లాడుతూ సిపిఐ, ఏఐటియుసి లు దళితులకు సముచిత స్థానం కల్పించకుండా అవమానపరుస్తున్నాయని కుమారస్వామి చేసిన వ్యాఖ్యలు సరైనవి కావని, ఏఐటియుసి మాజీ అధ్యక్షులు వై.గట్టయ్య ను, మద్దెల దినేష్ లను బయటకు వెళ్ళగొట్టారని పేర్కొనడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన అన్నారు. ఎవరో రాసిన పాటకు ఏఐటియుసి కి ఆపాదించి అబద్ధపు ప్రచారాలు చేయడం సరైంది కాదని, ఆ పాట పై పోలీసులు తగు విచారణ జరిపి దోషుల పై చర్యలు తీసుకోవాలని ఆయన అన్నారు. అదేవిధంగా దళితులకు సముచిత స్థానం కల్పించిన ఘనత సిపిఐ, ఏఐటియుసి లదని ఆయన అన్నారు. ఇంకా ఈ సమావేశంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు తాళ్ళపెల్లి మల్లయ్య, ఎం.ఎ.గౌస్, తొడుపునూరి రమేష్ కుమార్, ఉప్పులేటి తిరుపతి,గొడిశల నరేష్,తదితరులు పాల్గొన్నారు.

## ఇన్ఫోమాటిక్ రీసెర్చ్ ల్యాబ్స్ ఎంవోయూ



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** మదర్ థెరెస్సా ఇంజనీరింగ్ కళాశాల వారిచే ఇన్ఫోమాటిక్ రీసెర్చ్ ల్యాబ్స్ ఎంవోయూ కుదుర్చుకున్నాయి. ఈ ఎంవోయూ వలన మదర్ థెరెస్సా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు ఇన్ఫోమాటిక్ రీసెర్చ్ ల్యాబ్ యొక్క అన్ని రిసోర్సెస్ మరియు వర్క్ షాప్ లు ఉపయోగించుకునేందుకు అనుమతింపబడుతారు. ఇందులో భాగంగా కళాశాల డైరెక్టర్ ఏ.న వత , ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీనివాస్ మరియు ఇన్ఫో మాటిక్ రీజినల్ హెడ్ వంశీకృష్ణ కనగల ఎంవోయూ కుదుర్చుకున్నారు. కళాశాల అకౌంట్స్ ఆఫీసర్ పి.పవన్ కుమార్ , ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మరియు వివిధ విభాగాతిప తులు,అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## సింగిల్ విండో చైర్మన్‌గా యాదగిరి రావు బాధ్యతలు

**ప్రజాపక్షం/ముత్తారం :** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల సింగిల్ విండో చైర్మన్‌గా అల్లాడి యాదగిరి రావు బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. గత ఏడాది డిసెంబర్ 19 తేదీ నాటికి పాలకవర్గం పదవీ కాలం ముగియడంతో, ఎన్నికలు నిర్వహించకుండా ప్రభుత్వం వారి పదవులను రద్దు చేస్తూ గతంలో జీవో జారీ చేసింది. అయితే ప్రభుత్వ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. ప్రభుత్వం కొత్త గా ఎన్నికలు నిర్వహించే వరకు,నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసే వరకు పాత వారే చైర్మన్లుగా కొనసాగాలని ఆదేశాలు జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో బుధవారం సింగిల్ విండో కార్యాలయంలో అల్లాడి యాదగిరి రావు మళ్లీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఈఓ ప్రసాద్ గౌడ్ తో పాటు కార్యాలయ సిబ్బంది చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో రైతు వారం కార్యక్రమం

### మెట్‌పల్లి విద్యుత్ శాఖ డి.ఈ మధుసూదన్

**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రైతు వారం కార్యక్రమాల పరంపరలో భాగంగా,మెట్‌పల్లి డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, మెట్ పల్లి మండలంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బుధవారం మెట్‌పల్లి విద్యుత్ శాఖ డి.ఈ మధుసూదన్ పేర్కొన్నారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు మెట్‌పల్లి మండలం లోనీ వెల్లుల రైతు వేదిక ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరగనుందని సౌర శక్తి వినియోగం, పిఎం కుసుమ్ అంశాల పై రైతులకు సమగ్ర అవగాహన కల్పించనున్నారని ప్రస్తుత పరిస్థితుల్లో విద్యుత్ వినియోగాన్ని తగ్గిస్తూ, సౌర శక్తిని వ్యవసాయంలో వినియోగించడం ద్వారా ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అధికారులు వివరించనున్నారు. అలాగే రైతులు సౌర పంపులు, సౌర విద్యుత్ పథకాలపై ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు, ప్రయోజనాల గురించి కూడా తెలియజేయనున్నారు.ఈ కార్యక్రమానికి మెట్‌పల్లి మరియు మల్లాపూర్ మండల గ్రామాల రైతులు, రైతు ఉత్పత్తి సంస్థలు (యఫ్ పి ఓ యస్), సహకార సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు మరియు సంబంధిత అధికారులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమం ద్వారా రైతులు ఆధునిక సాంకేతికతలను అర్థం చేసుకొని, తమ వ్యవసాయంలో ఉపయోగించుకోవడం ద్వారా ఆదాయం పెంపొందించుకోవచ్చని డిఈ మదుసుధన్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# లాడ్జ్ యజమానులు నిబంధనలు పాటించాలి

### పోలీసుల కఠిన మార్గదర్శకాలు

**ప్రజాపక్షం/ధర్మపురి :** ధర్మపురి పట్టణ పరిధిలోని లాడ్జ్ యజమానులు పోలీసులు, ప్రభుత్వ నిబంధనలు పాటించాలని ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎలపాటి రాంనర్సింహా రెడ్డి ధర్మపురి ప్రైవేటు లాడ్జ్ యజమానులను హెచ్చరించారు. బుధవారం ధర్మపురి పోలీస్ స్టేషన్ లో లాడ్జ్ యజమానుల తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు.ఈ సమావేశంలో ధర్మపురి సర్కిల్ ఇన్స్పెక్టర్ రామ నరసింహారెడ్డి మాట్లాడుతూ పట్టణ భద్రత,శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా లాడ్జ్ యజమానులు తప్పనిసరిగా నిబంధనలు అనుసరించాలన్నారు. లాడ్జ్‌లలో గదులు కేటాయించే ముందు ప్రతి అతిథి నుండి ఆధార్ కార్డు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా సేకరించి,వాటి వివరాలను రికార్డు చేయాలని ఆదేశించారు.అదేవిధంగా,లాడ్జ్ ప్రాంగణమంతటా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి,అవి నిరంతరం సక్రమంగా పనిచేసే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. మార్గదర్శకాలను పాటించని నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు.అనుమానాస్పద వ్యక్తులకు గదులు కేటాయించడం వలన నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉన్నందున,లాడ్జ్ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో పాల్గొన్న లాడ్జ్ యజమానులు పోలీసు శాఖ సూచనలను కచ్చితంగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు.ఎస్ఐ గురక మహేశ్,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



# హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ హనుమాన్ శోభాయాత్ర

### హిందూ ధర్మమే దేశానికి రక్ష మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్

**ప్రజాపక్షం/జమ్మికుంట :** హిందూ ధర్మాన్ని కాపాడాలంటే మనకు రక్షణ కోసం హనుమాన్ ఉంటాడని అలాంటి నమ్మకాన్ని వెలిబుచ్చాలంటే ఇలాంటి హిందూ యాత్రలు చేయాలని అప్పుడే ధర్మం నాలుగు పదాల నడుస్తుందని హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి హనుమాన్ భారీ విగ్రహాలు, గేరెల్లా , మహిళా కోలాటాలు మహిళా వాయిద్యాలు , భర్త నాట్యం అనేక రకాల కార్యక్రమాలు లో పాల్గొన్న ముఖ్య అతిథులు మాట్లాడారు. జమ్మికుంట పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ హనుమాన్ శోభాయాత్రను ఉత్సవ సమితి నిర్వాహకులు ఆకుల రాజేందర్, పొన్నగంటి రవికుమార్, బచ్చు శివకుమార్, కడం సతీష్, సంపెల్లి సంపత్ రావు, పొన్నగంటి విష్ణు, పొనగంటి మల్లయ్య, దయ్యాల ప్రభాకర్, టంగుటూరి రాజకుమార్, సిరియాల విజయ పటేల్, ఆవుల తిరుపతి, పుట్టాల మల్లేష్, శీల జయ ప్రకాష్, పాకాల రవీందర్ రెడ్డి, చిత్రాల శ్రీనివాస్, కొండ్ల పాపయ్య, కొండ నరేష్, గర్రెపల్లి నిరూపమా, కంకణాల రమాదేవి, పొన్నగంటి శారద, ఎంసాని సమ్మయ్య, మరియు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

# కార్పొరేషన్ చైర్మన్‌గా బొమ్మ శ్రీరాం నియామకంపై హర్షం



**ప్రజాపక్షం /మెట్‌పల్లి :** తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా బొమ్మ శ్రీరాం చక్రవర్తి నియామకాన్ని మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జెట్టి లింగం హర్షం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, బొమ్మ శ్రీరాం తన తండ్రి, మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకటేశ్వర్లు అడుగుజాడల్లో నడుస్తూ కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘకాలంగా క్రియాశీలకంగా సేవలందిస్తున్నారని కొనియాడారు. ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న బొమ్మ శ్రీరాం చక్రవర్తిని మున్నూరు కాపుల సంక్షేమానికి సంబంధించిన కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించ దం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్,ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# మొక్కజొన్న కొనుగోళ్ళు వేగవంతం చేయాలి



సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి

**ప్రజాపక్షం/జమ్మికుంట :** అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి తాము పండించిన మొక్కజొన్న పంటను విక్రయించేందుకు వారం రోజులుగా జమ్మికుంట కొనుగోలు కేంద్రంలో పడిగాపులు కాస్తున్నారని వెంటనే కొనుగోళ్ళు వేగవంతం చేయాలని, లారీల కొరత సమస్యను పరిష్కరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జమ్మికుంట కొత్త మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వాసుదేవరెడ్డి మాట్లాడుతూ ఏప్రిల్ 29 న అట్టహాసంగా ప్రారంభించిన కొనుగోలు కేంద్రంలో ఇప్పటివరకు 10 కూడా కొనుగోలు చేయలేదని, కొనుగోలు కేంద్రంలో రోజుల తరబడి అన్నదాతలు పడిగాపులు కాస్తున్నారని, వెంటనే కొనుగోళ్ళు యుద్ధ ప్రాతిపదికన జరపాలని, తూకం వేసిన బస్తాలు లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సుమారు 30 వేల క్వింటాళ్ల మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రంలో విక్రయించడానికి సిద్ధంగా అన్నదాతలు ఎదురుచూస్తున్నప్పటికీ మార్క్ ఫెడ్ అధికారుల నిర్లక్ష్యం వహించడం మూలంగా అన్నదాతలు. అరిగోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిల్వ చేయడానికి గోడౌన్ సమస్య తీవ్రంగా ఉందని, రవాణా కోసం లారీల సమస్య ఉందని నిర్వాహకులు చెబుతున్నారని, సమస్యలు పరిష్కరించాల్సిన అధికార యంత్రాంగం ఏం చేస్తున్నట్లు అని ప్రశ్నించారు. ఒకవైపు వాతావరణ శాఖ అకాల వర్షాలు ఉన్నాయని హెచ్చరిస్తున్నప్పటికీ కొనుగోళ్ళు వేగవంతం చేయకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది అన్నారు. మార్కెట్లో కనీస సౌకర్యాలు పాలకవర్గం కల్పిస్తున్నప్పటికీ మార్క్ఫెడ్ సిబ్బంది తగినంతగా లేకపోవడం మూలంగా కొనుగోలు ఆలస్యం అవుతున్నాయి అన్నారు. వెంటనే తగినంత సిబ్బందిని నియమించి కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.ధంబ్ ఇంప్రెషన్ రాకపోవడం మూలంగా అనేక మంది రైతులు తాము పండించిన పంటను మద్దతు దరకు అమ్ముకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోళ్ళకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. మండలానికి ఒక మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజకీయాలకు అతీతంగా, రైతులకు అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కమిటీ సభ్యులు దండి సతీష్, వద్దూరి కిషోర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం అశోక్, మండల అధ్యక్షుడు కాయిత లింగారెడ్డి, కోశాధికారి లింగంపల్లి శ్రీనివాస్, రైతులు గుండారపు కుమారస్వామి, ఉప్పే మల్ల సంజీవ్, సమ్మయ్యసమ్మయ్య, భూమి రెడ్డి, రజిత, రాజిరెడ్డి, రాజేశ్వరరావు, మల్లయ్య, పాల్గొన్నారు.

# కేంద్ర సహాయక మంత్రి వ్యక్తిగత దూషణలు మానుకోవాలి

### జగిత్యాల జడ్పీ మాజీ చైర్ పర్సన్ వసంత

**ప్రజాపక్షం/జగిత్యాల :** కేంద్ర సహాయక శాఖ మంత్రి బండి సంజయ్ కుమార్ వ్యక్తి గత దూషణలు మానుకోవాలని జగిత్యాల జిల్లా జడ్పీ మాజీ చైర్ పర్సన్ దావ వసంత పేర్కొన్నారు. జగిత్యాల జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా తొలి జడ్పీ చైర్పర్సన్ దావ వసంత సురేష్ బుధవారం బిఆర్ఎస్ నాయకులతో కలిసి మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడారు.కేంద్ర సహాయ మంత్రిగా వ్యవహరిస్తూ పాన్ డబ్బాల కాడ మాట్లాడుకున్నట్లు నాయకులను కించపరుస్తూ మాట్లాడారని మండిపడ్డారు.బీజెపి క్రమశిక్షణ గల పార్టీ అంటారని, మోడీ,అమిత్ షా లు ఇలానే మాట్లాడమని చెప్పారా అని సంజయ్ ని ప్రశ్నించారు. రాజకీయాలు మాట్లాడమంటే వ్యక్తిగత దుషణ ,భూతులు మాట్లాడటం మీ సహాయ మంత్రి పదవికి అవమానంగా లేదా..?ఒకసారి సరిచూసుకోవాలి బండి సంజయ్ కుమార్ కు హితవు పలికారు.ఇంటికి కూత వేటు దూరంలో కాల్పులు జరిగి దొంగలు నగలు అపహరించుకుపోతే స్పందించడం తప్ప..?.మీకు కేంద్ర సహాయ మంత్రి పదవి ఏ ఏ క్వాలిటీ చూసి ఇచ్చారో మాకైతే అర్థం కావడం లేదన్నారు. నోటికొచ్చినట్లు ఒర్రుదే క్వాలిఫికేషన్ నా అని ప్రశ్నించారు.ఒక ప్రతిపక్ష లీడర్ ను పట్టుకొని మీ ఇష్టం వచ్చినట్లు పాన్ పరాగ్ దూషణలు చేస్తే నిజం అబద్ధం అయిపోతుందా..? బండి సంజయ్ నిజం తెలుసుకోవాలన్నారు. ఈ చిల్లర దూషణలు, భాష నీ హోదాకు కళంకం తెచ్చిపెడుతుందని ఎందుకైనా మంచిదే ఒకసారి సరి చేసుకొని మాట్లాడాలన్నారు.కేటీఆర్ ను కరీంనగర్ రానివ్వమని అనడం ఎంతవరకు సమంజసమన్నారు. కరీంనగర్ ను మీకు రాష్ట్ర ప్రభుత్వం దత్తత ఇచ్చిందా..?. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిమ్మల్ని ఏలుకోమని చెప్పారా...? కరీంనగర్లో లాండ్ ఆర్డర్ ఉందదా..?మీరు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్నారు కదా.. ఈ మాత్రం జ్ఞానం లేకుండా నోటికొచ్చింది వాగడం మూలంగా మిమ్మల్ని మీరే తగ్గించుకున్న వారు అవుతారన్నారు.కేటీఆర్ రాజకీయ విమర్శలు చేశారని మీరు దానికి తిరిగి కౌంటర్ ఇవ్వాల్సింది పోయి నోటికొచ్చిన కూతలు సరైనది కాదన్నారు. బూతులు మీకే కాదు బిఆర్ఎస్ కార్యకర్తలకు నాయకులకు అందరికీ వస్తాయన్నారు.క్రమశిక్షణ అడ్డం వచ్చి పెద్దలను గౌరవించడం నేర్చుకున్న మాకు వ్యక్తిత్వం అడ్డం వస్తుందన్నారు.ఇప్పటికైనా కేటీఆర్ పట్ల మీరు చేసిన దూషణలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తో మీకున్న సన్నిహిత సంబంధాలు ను గుర్తు చేయగానే ఎందుకంత ఉలిక్కిపడుతున్నారు. నిప్పు లేనిదే పొగ రాదు కదా.. అంత తొందర ఎందుకు.. బంధాలు అనుబంధాలు అన్ని తేటతెల్లమవుతాయన్నారు. సమయం వచ్చినప్పుడు నీ బండారం బయట పెట్టడం ఖాయమన్నారు.కెసిఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత దూషణ చేసి ముఖ్యమంత్రి అయ్యారన్నారు. అయినా ఏ రోజు కూడా కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు తన నోటి వెంట పలకలేదన్నారు.. అంటే ఆయన స్థాయికి ఈ చిల్లర మాటలు లెక్క కాదని దాని అర్థమన్నారు. ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్ రావు, దేవేందర్ నాయక్ ,శీలం ప్రవీణ్, జున్ను రాజేందర్, గాజుల రాజేందర్, ఆనంద్ రావు ,సింగరావు, సుధాకర్, శీలం సురేందర్, తుమ్మ గంగాధర్ ,నీలి ప్రతాప్,ఆదేపు సత్యం ,అనురాధ, కళ్యాణి ,నవీన్ ,ఆరుముల్ల మానస శివకుమార్, Brs నాయకులు,తదితరులు పాల్గొన్నారు.



## సత్ఫలితాలు ఇస్తున్న భైంసా ప్రజావాణి

### ఫిర్యాదుదారులతో కిక్కిరిసిన భైంసా ఎస్‌పి క్యాంపు ఆఫీస్




**ప్రజాపక్షం / భైంసా :** భైంసా క్యాంపు ఆఫీసులో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఫిర్యాదుదారులు జిల్లా ఎస్.పి., డా. జి. జానకి షర్మిలను కలిసి సమస్యలను విన్నవించుకునేందుకు ప్రజలు భైంసా ఎస్.పి. క్యాంపు కార్యాలయానికి పోటెత్తారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎస్పీకి తెలియజేయాలనే ఉద్దేశంతో భైంసా సబ్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల నుండి 16 మంది ఫిర్యాదుదారులు వారి సమస్యలను విన్నవించేందుకు భైంసా క్యాంపు రావడం జరిగింది. దీంతో క్యాంపు ఆఫీస్ మొత్తం ఫిర్యాదుదారులతో నిండి పోయింది. జిల్లా ఎస్.పి. జానకీ షర్మిల మాట్లాడుతూ ప్రతి ఒక్క ఫిర్యాదుదారుడి సమస్యను ఎంతో ఓర్పుతో, శ్రద్ధగా విని సంబంధిత పోలీసు అధికారులకు వెంటనే విచారణ జరిపి, న్యాయపరమైన, చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో ఏలాంటి ఆలస్యం లేకుండా పనిచేయాలని, బాధితులకు న్యాయం జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను నేరుగా వినిపించుకునే అవకాశం కల్పించినందుకు ఫిర్యాదుదారులు ఆనందం వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్.పి. జి. జానకీ శర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

## నిర్మల్ ఆప్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

### వేసవిలో దాహార్తి తీర్చడమే లక్ష్యం

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** ఎండల మండుతున్న వేళ బడుగు బలహీన వర్గాలు , సామాన్య ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఆమ్ ఆద్మీ పార్టీ, నిర్మల్ జిల్లా కమిటీ మానవత్వంతో ముదుకు వచ్చింది. పార్టీ జాతీయ నాయకులు అరవింద్ కేజ్రివాల్ ఆశయాలకు అనుగుణంగా, ప్రజలకు చల్లని తాగునీరు అందించేందుకు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రెటరీ, నిర్మల్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ హైదర్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సయ్యద్ హైదర్ మాట్లాడుతూ, ఆమ్ ఆద్మీ పార్టీ ఎల్లప్పుడూ సామాన్య ప్రజల సంక్షేమం కోసమే పనిచేస్తుందని స్పష్టం చేశారు. ముఖ్యంగా కూలీలు, కార్మికులు, పేద ప్రజల అవసరాలను గుర్తించి ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. ప్రజాసేవ ద్వారానే సమాజంలో మార్పు సాధ్యమని, భవిస్యత్తులో కూడా ఇలాంటి సేవా యజ్ఞాలు కొనసాగుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ చలివేంద్రం ఏర్పాటుకు జిల్లా ఉపాధ్యక్షులు బి. శ్రీనివాస్ దాతగా వ్యవహరించడం పట్ల పార్టీ నాయకత్వం హర్షం వ్యక్తం చేసింది. ఇలాంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని స్థానికులు కొనియాడారు. నిర్మల్ జిల్లా స్పోక్ పర్సన్ వసంతరావు, ట్రెజరర్ అబ్దుల్ సాధిక్, జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజన్న జిల్లా నాయకులు అరవింద్ లక్ష్మ ణచాంద మండల ఇన్‌చార్జి షేక్ ఇమాం , టౌన్ సెక్రెటరీ అబ్దుల్ వహీద్ పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కమిషనర్‌కు విన్నపం

**ప్రజాపక్షం/మందమర్రిః** మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని నార్లాపూర్ ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల పరిష్కారం కోసం బుధవారం మున్సిపల్ కమిషనర్ రాజలింగు, డిఇ సుమతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గోదావరి నీటి కనెక్షన్ బిల్లుల మినహాయింపు ఇవ్వాలని, మంజూరైన సిసి రోడ్డు పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వార్డులో ప్రతిరోజు నీటి సరఫరా చేయాలని, పాడైన చేతి పంపులకు మరమ్మతులు చేపట్టాలని కోరారు. డ్రైనేజీల శుభ్రతతో పాటు కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని విన్నవించారు. మేడారం స్టేజి నుండి నార్లాపూర్ గేట్ వరకు వీధి దీపాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.



దీనిపై కమిషనర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి సానుకూలంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. విహెచ్‌పిఎస్ జాతీయ నాయకులు పెద్దపల్లి సత్యనారాయణ, జడ కొమరయ్య, అరకటి రవీందర్ పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

### సర్పంచ్ రావుల లావణ్య, శ్రీనివాస్

**ప్రజాపక్షం / ముథోల్ :** ఉపాదిహామీ పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆష్టాగ్రామ సర్పంచ్ రావుల లావణ్యశ్రీనివాస్ సూచించారు. మండలంలోని ఆష్టా గ్రామంలో జరుగుతున్న ఉపాది హామీ పనులను బుదవారం ఎంపిడిఓ లవకుమార్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండ తీవ్రత పెరగడంతో పనులకు తొందరగా వచ్చి ముగించుకోవాలని తెలిపారు. పనులకు వస్తున్న కూలీలకు దినసరి వేతనాలు సరైన సమయంలో ఖాతాలో జమ అవుతున్నాయ అని అడిగి తెలుసుకున్నారు. పనులకు వస్తున్న కూలీలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఏర్పడితే సిబ్బందిని ఆశ్రయించాలన్నారు. గ్రామ



సర్పంచ్ రావుల లావణ్య శ్రీనివాస్ సుమారు 300 మంది కూలీలకు మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపిడిఓ లవకుమార్, ఉపాదిహామీ టిఏ యోగేష్, పంచాయతీ కార్యదర్శి గంగాధర్‌లను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి సురుగుల పోశెట్టి, కండెల అశోక్, లోలం మురళి, కనకాపురం అనీల్, మినాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టిజీ20 లీగ్ నిబంధనలకు విరుద్ధం

### హెచ్‌సిఏ తీరుపై టిసిఏ నిర్మల్ జిల్లా కోచ్ రామారాజు హెచ్చరిక

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) ఇటీవల ప్రకటించిన టీజీ20 ప్రీమియర్ లీగ్ నిబంధనలకు విరుద్ధమని, దానిని తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ నిర్మల్ జిల్లా కోచ్ రామరాజు స్పష్టం చేశారు. హెచ్‌సిఏ నిర్వహిస్తున్న ఈ లీగ్ చట్టపరమైన చిక్కుల్లో పడే అవకాశం ఉందని హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా క్రికెట్ ను విస్తరిస్తున్నామని హెచ్‌సిఏ చేస్తున్న ప్రచారం పూర్తిగా అవాస్తవమని గత 80 ఏళ్ళుగా తెలంగాణ జిల్లాల్లో క్రికెట్ అభివృద్దికి హెచ్‌సిఏ ఎటువంటి కృషి చేయలేదని ఆయన విమర్శించారు. జిల్లా స్థాయిలో అవసరమైన కమిటీలు, మౌళిక సదుపాయాలు, ఆటగాళ్ళ నెట్‌వర్క్ వంటి కనీస వ్యవస్థలు హెచ్‌సిఏ వద్ద లేవని రామరాజు పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా బిసిసిఐ నిబంధనల ప్రకారం జిల్లా కమిటీలు, ప్లేయర్ రిజిస్ట్రేషన్లు, టోర్నమెంట్లు, కోచింగ్ ప్రేంవర్కుతో గ్రాస్‌రూటు స్థాయి నుంచి క్రికెట్‌ను నడుపుతున్న ఏకైక సంస్థ టిసిఏ మాత్రమేనని ఆయన గుర్తు చేశారు. టిసిఏతో ఏలాంటి సంప్రదింపులు జరపకుండా, ఏకపక్షంగా లోగో ఆవిష్కరణ చేయడం , ప్రాంచైజీల కోసం నోటిఫికేషన్ విడుదల చేయడం నేరమని ఆయన అభివర్ణించారు. ముఖ్యంగా బొంబాయి హైకోర్టులో కేసు తుది తీర్పు కోసం పెండింగ్‌లో ఉన్న తరుణంలో, ఇలాంటి కీలక నిర్ణయాలు తీసుకోవడం కోర్టు దిక్కరణ కిందకు వస్తుందని రామ రాజు హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తున్న టిజి20 లీగ్‌ను తక్షణమే నిలిపివేయాలని , లేని పక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని ఆయన ఈ ప్రకటన ద్వారా స్పష్టం చేశారు.



## విద్యుత్ భద్రతతోనే ప్రమాదాల నివారణ

**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** విద్యుత్ రంగానికి చెందిన సిబ్బంది విధి నిర్వహణలో ఏ పొరపోటు ఉండవద్దని , భద్రతా నియమాలు పాటించడం ద్వారానే ప్రమాదాలను నివారించవచ్చని టి.జి.ఎన్.పి.డి.సి.ఎల్. నిర్మల్ సర్కిల్ పర్యవేక్షక ఇంజనీర్ ఎస్.ఇ. జె. సుభాష్ పిలుపునిచ్చారు. మే 1వ తేది నుండి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న విద్యుత్ భద్రత వారోత్సవాలలో భాగంగా బుధవారం నిర్మల్ సర్కిల్ కార్యాలయంలో సిబ్బందికి ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్.ఇ., జె.సుభాష్ మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో లైన్‌మెన్‌లు , ఇతర సిబ్బంది ఎదుర్కొనే సవాళ్ళను ప్రస్తావించారు ముక్యంగా ఎల్.టి., హెచ్.టి. లైన్ల మరమ్మత్తులు చేపట్టేటప్పుడు , ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ సమయంలో ఖచ్చితంగా ఎర్త్ రాడ్స్, గ్లౌజులు, హెల్మెట్లు వంటి భద్రతా పరికరాలను ధరించాలని ఆదేశించారు. లైన్ క్లీయరెన్స్, ఎల్.సి. తీసుకునే విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా అధి ప్రాణాపాయానికి దాని తీస్తుందని హెచ్చరించారు. డి.ఇ. నాగరాజు మాట్లాడుతూ, వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో విద్యుత్ తీగలు తెగిపడటం చెట్ల కొమ్మలు లైన్లపై పడటం వంటి సమస్యలు ఎదురవుతాయని, అటువంటి సమయాల్లో సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండి వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించాలని కోరారు. అనంతరం సావు దిగంబర్ మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమంతో పాటు భద్రతకు సంస్థ ప్రథమ ప్రాధాన్యమిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఇ లు శ్రీనివాసరావు, వెకటపతిరాజు, ఏఇ. సంజీవ్, రాజ్‌కిరణ్, అనీల్, సాయి కుమార్, మహేష్, సబ్ ఇంజనీర్లు కళ్యాణ్, వెంకటేష్, సాయికిరణ్ ప్రత్యేషతో పాటు లైన్ ఇన్స్‌పెక్టర్లు, లైన్‌మెన్‌లు , కార్యాలయ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## పిఎసిఎస్ చైర్మన్‌గా జాబోరే పెంటూ బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/వాంకిడిః** వాంకిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ గా జాబోరే పెంటూ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వం పిఎసిఎస్ పదవీకాలాన్ని పొడిగించిన నేపథ్యంలో ఆయన మరోసారి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని చెప్పారు. రైతులకు ఎరువులు, విత్తనాలు, పంట రుణాలు సకాలంలో అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. సహకార సంఘాన్ని మరింత బలోపేతం చేసి పారదర్శక సేవలు అందిస్తామని పేర్కొన్నారు. వాంకిడి సర్పంచ్ చునర్కర్ సతీష్, బంబార సర్పంచ్ బెండరే కృష్ణాజీ, మాజీ సర్పంచ్ దుర్గం కమలాకర్, డైరెక్టర్లు గొల్ల, మహాత్మ దిగంబర్, చెప్లే సీతారాం పటేల్, సిఈఓ ఒమాజీ, ఆర్. ధాకర్ పాల్గొన్నారు.

## రైతులకు సాగుపై అవగాహన



**ప్రజాపక్షం/జన్నారంః** జన్నారం మండలం చింతగూడ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారోత్సవాలలో భాగంగా బుధవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు రైతులకు యూరియా వినియోగం తగ్గించి సమతుల్య ఎరువులు వాడాలని సూచించారు. పంట వైవిధ్యం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా వరి రకాల ఎంపిక, నీటి ఆదా పద్ధతులు, సేంద్రీయ వ్యవసాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సాగులో రసాయనాల వినియోగం తగ్గించి నాణ్యమైన దిగుబడి సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుతారి సుమలత వినయ్, ఇంచార్జ్ ఏఈఓ అజిత్ కుమార్, నాసాని రాజన్న, లవన్ కృష్ణ పాల్గొన్నారు.

## అటవీ ప్రాంతంలో అభివృద్ధి పనుల పరిశీలన



**ప్రజాపక్షం/జన్నారంః** జన్నారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో అటవీ ప్రాంతంలో చేపడుతున్న న్యూ పీటీ వర్క్ పనులను ఎంపిడిఓ ఉమర్ షరీఫ్, ఎపిఓ కలిసి బుధవారం పరిశీలించారు. పనుల పురోగతిని పర్యవేక్షించి, నాణ్యత ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని అధికారులకు సూచించారు. అనంతరం ధర్మారం అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న వాటర్ హార్వెస్టింగ్ పాండ్ పనులను తనిఖీ చేశారు. భవిష్యత్తులో భూగర్భ జలాలు పెరిగేందుకు వర్షపు నీటిని నిల్వ చేసే విధంగా ఈ పనులను సమర్థవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సిబ్బంది, గ్రామ ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు వేగవంతం చేయకుంటే జాతీయ రహదారిపై ధర్నా

**ప్రజాపక్షం/కోటపల్లిః** కోటపల్లి మండలం పారుపెల్లి గ్రామంలో వర్షానికి తడిసిన వడ్ల కొనుగోలు కేంద్రాన్ని బిఆర్ఎస్ నాయకులు బుధవారం సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మరిశెట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో వడ్లు తడిసి ముద్దవుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వడ్ల కొనుగోలు ప్రక్రియను వెంటనే వేగవంతం చేయాలని, లేనిపక్షంలో పారుపెల్లి జాతీయ రహదారిపై వెయ్యి మంది రైతులతో ధర్నా చేస్తామని హెచ్చరించారు. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## గోడౌన్లను సిద్ధం చేయాలి

### అధికారులను ఆదేశించిన కలెక్టర్



**ప్రజాపక్షం / సారంగాపూర్ :** వరి ధాన్యం నిల్వ చేయడానికి గోడౌన్లను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డును తనిఖీ చేసి గోడౌన్లను పరిశీలించారు. వరిధాన్యం కొనుగోలును త్వరలోనే పూర్తి చేస్తామని ఇక్కడి ధాన్యాన్ని ఇక్కడే నిల్వచేసే ఏర్పాట్లు చేపడుతామని రైతులకు హామీ ఇచ్చారు. గోనె సంచులు, లారీల కొరత లేకుండా చూడాలని అదికారులను ఆదేశించారు. వీరి వెంట అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్, తహసిల్దార్ విజయ్ కాంతారావు, ఎంపిడిఓ లక్ష్మీకాంత్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఐ.టి.డి.ఎ. పి.ఓ. మంద మకరందు



**ప్రజాపక్షం / నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాను ఉట్నూరు ఐటిడిఏ ప్రాజెక్ట్ ఆఫీసర్ మంద మకరందు బుధవారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన ఈ సమావేశంలో పి.ఓ. కలెక్టర్‌కు పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో ఐటిడిఏ పరిధిలో సాగుతున్న పలు అభివృద్ధి పనులపై ఇరువురు చర్చించారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో అమలవుతున్న సంక్షేమ పథకాలు, విద్యా, వైద్య సదుపాయాలు, పరిపానాపరమైన అంశాలపై పి.ఓ. కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాపక్షం/బాల్కొండః** బాల్కొండ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో 7న గురువారం రోజున విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఎఈ కిషన్ తెలిపారు. 33/11 కెవి విద్యుత్ లైన్ వద్ద చెట్లు తొలగింపు అలాగే మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. ఈ సందర్భంగా వినియోగదారులు రైతులు సహకరించాలని కోరారు.

## ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశం

**ప్రజాపక్షం/ భీమ్‌గల్ రూరల్ :** మండలంలోని మెండోరా గ్రామ ఒడ్డెర కాలనీకి చెందిన పల్లపు స్వామి ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్‌చారి జముత్యాల సునీల్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై సర్పంచ్ కుంట లక్ష్మీ రమేష్‌తో కలిసి గృహాన్ని ప్రారంభించి స్వాతికి శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు.

## ప్రభుత్వం వెంటనే దొడ్డు వడ్లను కొనుగోలు చేయాలి

**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** నియోజకవర్గంలో వరి కొనుగోలు కేంద్రాలలో ఇష్టారీతిన కడ్తా ఏడు నుంచి పది కిలోలు కటింగ్ చేస్తూ రైతులను నట్టేట ముంచుతున్నారని అలాగే కొనుగోలు కేంద్రాలలో ఇప్పటివరకు వరి కొనుగోలు కేంద్రాలు మొదలు పెట్టలేదని ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లిఖార్జున్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వంకు చిత్తశుద్ధి ఉంటే రైతులను ఇబ్బంది పెట్టకుండా వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఎలాంటి కడ్తా లేకుండా వరి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. 10న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే భారీ బహిరంగ సభకు పిఎం మోడీ వస్తున్నాని ఆ కార్యక్రమంకు నియోజకవర్గం నుండి వేలాది మంది తరలి రావెళ్లామని నాయకులకు దిశానిర్ధేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతిరెడ్డి, మోహన్‌రెడ్డి, రవీందర్, నర్సింగరావు, నర్సారెడ్డి, నర్సయ్య, లక్ష్మణ్‌గౌడ్, రామాగౌడ్, చిట్టిగౌడ్, గంగాధర్, ప్రేమ్‌చంద్, నవీన్, గంగాధర్, నర్సయ్య, ప్రవీన్ పాల్గొన్నారు.



## డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్‌కు డిసిసి చైర్మన్‌గా సృజిల్

**ప్రజాపక్షం/నిజామాబాద్ః** డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్‌కు జిల్లా డీసీసీ చైర్మన్‌గా వర్ధన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సృజిల్ బాబు తెడ్డును నియమించారు. బుధవారం హైదరాబాద్‌లోని నాంపల్లి గాంధీభవన్‌లో అధ్యక్షులు బొమ్మ మహేష్కుమార్‌గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీని బలోపేతం చేయడానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ నాయకత్వాన్ని నిలబెట్టడానికి ప్రజారోగ్యాన్ని బలోపేతం చేయడానికి మరింత దోహదపడేందుకు నిరంతరం కృషి చేయాలని తాను కోరుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ సృజిల్‌బాబు మాట్లాడుతూ తనపై నమ్మకంతో డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ వింగ్‌కు జిల్లా డీసీసీ చైర్మన్‌గా నియమించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు మల్లని శివ మాదిగ, కాంగ్రెస్ పార్టీ నగర జర్నల్ సెక్రటరీ ధర్మారం అవీన్, తెడ్డు బాబు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు సెంటర్లను పరిశీలించిన తహసీల్దార్

**ప్రజాపక్షం/మోర్తాడ్ః** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండల కేంద్రంతో పాటు బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలోని ధాన్యం సెంటర్లను మోర్తాడ్ తహసీల్దార్ పరిశీలించారు. మండల కేంద్రంలోని ఏసిఎస్ ధాన్యం సెంటర్‌ను పరిశీలించి రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా ఐకెపి మోర్తాడ్ సెంటర్ ఐకెపి పాలెం, డోన్కల్ సెంటర్లను కూడా పరిశీలించారు. రైతుల పేర్లు రిజిష్టర్లలో నమోదు చేస్తున్నారా..? లేదా..? అనేది పరిశీలించారు. అదేవిధంగా రైతులను వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం బస్తాలు లారీలలో రైస్ మిల్ కు పంపుతున్నారా..? లేదా అన్న సమాచారాన్ని తెలుసుకున్నారు. కార్యాలయంలో ధాన్యం సేకరణ రికార్డులను మోర్తాడ్ తహసీల్దార్ కృష్ణ పరిశీలించారు.



## గీత కార్మిక కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా మోత్కురి

**ప్రజాపక్షం/ నిజామాబాద్ :** తెలంగాణ గీత కార్మిక కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్‌గా నిజామాబాద్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు మోత్కురి చంద్రశేఖర్‌గౌడ్‌ను నియమించారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న పలు కార్పోరేషన్ చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులను భర్తీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రామకృష్ణరావు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా శేఖర్‌గౌడ్ మాట్లాడుతూ పార్టీ కోసం పని చేసిన తనకు రాష్ట్ర గీత కార్మిక కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్‌గా నియమించిన రాష్ట్ర ప్రభుత్వానికి రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గీత కార్మికుల హక్కుల కోసం పోరాడుతామని, నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానన్నారు. తాను మునుగోడు, దుబ్బాక బై ఎలక్షన్స్ లో ఇన్‌చార్జిగా దళిత దండోరా బోధన్ అసెంబ్లీకి ఇన్‌చార్జిగా, తెలంగాణ ఓబీసీ సెల్ వైస్‌చైర్మన్, నిజామాబాద్ ఓబీసీ సెల్ చైర్మన్‌గా, నిజామాబాద్ రూరల్‌కు మ ండల ప్రెసిడెంట్‌గా, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షునిగా, రాష్ట్ర వైస్‌ప్రెసిడెంట్‌గా బాడ్సీ సర్పంచ్‌గా జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఎన్ఎస్‌యుఐ స్టేట్ సెక్రటరీగా జిల్లా ఎన్ఎస్‌యుఐ వైస్‌ప్రెసిడెంట్‌గా సేవలందించారు. ప్రస్తుతం రూరల్ టీపీసీసీ డెలిగేట్‌గా పని చేశారన్నారు. తెలంగాణ గీత కార్మిక కోఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్ నియమించటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.



## జాన్కంపేట్ సోసైటీ చైర్మన్‌గా తిరిగి బాధ్యతలు : నరేందర్

**ప్రజాపక్షం/ఎడపల్లిః** నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని జాన్కంపేట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్‌గా మిద్దె నరేందర్ బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టు తీర్పుతో గత పాలకవర్గానికే తిరిగి అధికారాలు దక్కడంతో ఆయన బాధ్యతల స్వీకరణ కార్యక్రమం కొనసాగింది. కొన్ని నెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని సోసైటీ పాలకవర్గాలను రద్దు చేస్తూ వారి స్థానంలో అధికారులను పర్సనల్ ఇన్‌ఛార్జీలుగా నియమించిన సంగతి తెలిసిందే. ప్రభుత్వ నిర్ణయాన్ని సవాలు చేస్తూ రాష్ట్రంలోని సోసైటీ పాలకవర్గాలు హైకోర్టును ఆశ్రయించాయి. సుమారు నాలుగు నెలల 14రోజుల సుదీర్ఘ విచారణ కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా సహకార అధికారి జారీ చేసిన ఆదేశాలతో బుధవారం జాన్కంపేట్ సోసైటీ కార్యాలయంలో బాధ్యతల బదిలీ జరిగింది. ఇప్పటి వరకు పర్సనల్ ఇన్‌ఛార్జిగా వ్యవహరించిన ఎస్. సరళా దేవి నుంచి మిద్దె నరేందర్, పాలకవర్గ సభ్యులు అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. సోసైటీని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని, గ్రామ పెద్దలు, మాజీ ప్రజాప్రతినిధులు సభ్యులు, మా పాలకవర్గానికి పూర్తి మద్దతునిచ్చి సహకరించాలని కోరారు. సోసైటీ పాలకవర్గ సభ్యులు, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.



## ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సమన్వయకర్తగా వెంకట్, కవి



**ప్రజాపక్షం/ నిర్మల్ టౌన్ :** నిర్మల్‌కు చెందిన ప్రముఖ పద్యకవి, వ్యాఖ్యాత డా॥ బి.వెంకట్‌కవికి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు లభించింది శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్న 7వ ప్రపంచ తెలుగు సాహిత్య మహాసభల సమన్వయకర్తగా ఆయన నియమితులయ్యారు. ఈ మేరకు అంతర్జాతీయ చైర్మెన్ కత్తినుండ ప్రతాప్ కుమార్, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరి భూషణం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. వచ్చే నెల జూన్ 6,7 తేదీల్లో రాజమహేంద్రవరంలోని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో ఈ మహాసభలు వైభవంగా జరగనున్నాయి. తెలుగు భాషా వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ సభలను, వెంకట్ కవి తన నిర్వహణ నైపుణ్యంతో విజయవంతం చేయగలరని నిర్వహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. డా. బి.వెంకట్ కవి ప్రస్తుతం సంస్కృత భాషా ప్రచార సమితీ ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడిగా, తెలంగాణ రచయితల వేధిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆయనకు బాధ్యత లభించడం పట్ల జిల్లా సాహిత్య రంగ ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కొనసాగుతున్న నరసింహాస్వామి బ్రహ్మోత్సవాలు

**ప్రజాపక్షం / దిలావర్‌పూర్ :** జిల్లాలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ కాల్వ లక్ష్మీ నర్సింహాస్వామి వారి బ్రహ్మోత్సవాలు కన్నుల పండుగగా కొనసాగుతున్నాయి. మంగళవారం రాత్రి చక్రతీర్థం కార్యక్రమం అనంతరం బుదవారం ఉదయం నాగవెల్లి నిర్వహించారు. భాజా, భజంత్రీలతో, గోవింద నామాలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. భక్తులకు ఏలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ చైర్మెన్ అంగూర్ మహేందర్ పాలకమండలి సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు గట్టు కాశినాథ్, గుమ్మల నర్సయ్య పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

**ప్రజాపక్షం/ఆర్మూర్ః** ఆలూర్ మండలంలోని దేగాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఇస్సాపల్లి సబ్‌సెంటర్‌ను బుధవారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ రాజశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అన్ని రకాల రిజిస్ట్రర్లను పరిశీలించారు. బుధవారం జరిగే ఇమ్యూనైజేషన్ కార్యక్రమం ఎలా జరుగుతుందని, గ్రామంలోని గర్భిణీలకు పిల్లలకు ఈ వ్యాధి నిరోధక టీకాలను అందరికి కూడా ఖచ్చితంగా సరైన సమయంలో ఇవ్వాలని సూచించారు. అంతేగాకుండా ఎండలు తీవ్రంగా ఉన్నందు వల్ల గ్రామంలోని గ్రామప్రజలకు వడదెబ్బ పై అవగాహన కల్పిస్తూ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందరికి అందుబాటులో ఉండేలా చూసుకోవాలని చెప్పారు. వైద్యసిబ్బందికి ఖచ్చితంగా సమయపాలన పాటించాలని సూచించారు. అంతేగాకుండా సబ్‌సెంటర్‌లో జరుగుతున్న అన్ని రకాల వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు.

## బాధ్యతలు చేపట్టిన పిఎసిఎస్ పాలకవర్గ సభ్యులు

**ప్రజాపక్షం/మోర్తాడ్ః** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని పిఎసిఎస్ పాలకవర్గ సభ్యులు హైకోర్టు ఉత్తర్వులతో బుధవారం మోర్తాడ్ మండల కేంద్రంలోని పిఎసిఎస్ కార్యాలయంలో పిఎసిఎస్ చైర్మన్ అశోక్ రెడ్డి, అలాగే పాలకవర్గ సభ్యులు మోర్తాడ్ సోసైటీలో హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం జిల్లా సహకార అధికారి ఆదేశాల అనుసారం ఆఫీషియల్ పర్సన్ ఇన్‌ఛార్జి అధికారి నల్ల రాజేశ్వర్, నుంచి అధ్యక్షులు బద్దం అశోక్ రెడ్డి, అలాగే పాలక వర్గ సభ్యులు పదవి బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సోసైటీ కార్యదర్శి కాశీరాం, పిఎసిఎస్ సభ్యులు పాల్గొన్నారు.



# వెయ్యి కార్లు, 250 బస్సుల్లో జన సమీకరణ

### మోదీ సభకు అత్యధిక సంఖ్యలో జనాన్ని తరలించడంపై కేంద్ర మంత్రి దృష్టి

**ప్రజాపక్షం/కరీంనగర్:** ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఈనెల 10న సికింద్రాబాద్ లోని పరేడ్ మైదానంలో నిర్వహించే బహిరంగ సభను భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. చుట్టు పక్కల జిల్లాల నుండి భారీ ఎత్తున జనాన్ని సమీకరించే పనిలో నిమగ్నమైంది. ఈ నేపథ్యంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి అత్యధిక సంఖ్యలో జన సమీకరణ చేయడంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి ప్రత్యేక దృష్టి సారించారు. గత నాలుగు రోజులుగా కరీంనగర్ లోనే మకాం వేసి ఇతర కార్యక్రమాలను పక్కనపెట్టి పార్టీ నేతలతో జన సమీకరణపై సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం సమావేశాలు నిర్వహిస్తున్నారు. గ్రామాల వారీగా వార్డు సభ్యులు, ఉప సర్పంచులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. మరోవైపు కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లు, కంటెస్టెట్ కార్పొరేటర్లతోనూ మీటింగ్ లు నిర్వహించారు. జిల్లాల వారీగా మండలాల అధ్యక్షులతో, జిల్లా అధ్యక్షులతోనూ భేటీ అయ్యారు. గ్రామాలు, మండలాలు, మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా జన సమీకరణ లక్ష్యాన్ని నిర్దేశించారు. మండలాల వారీగా జన సమీకరణపై ఇంఛార్జీలను నియమించారు. అట్లాగే మోదీ సభకు జన సమీకరణ విషయంలో రాష్ట్ర నాయకత్వం జిల్లాల వారీగా ఇంఛార్జీలుగా నియమించిన సంగతి తెలిసిందే. అందులో భాగాం కరీంనగర్ జిల్లా ఇంఛార్జీగా ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, సిరిసిల్ల జిల్లా ఇంఛార్జీగా ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి సైతం జిల్లాల వారీగా పార్టీ నేతలతో మీటింగ్ నిర్వహించారు. మండలాల వారీగా ఎన్ని బస్సులు కావాలి.? ఎన్ని కార్లు కావాలనే వివరాలను నేతల నుండి వివరాలు తీసుకున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల వారీగా నేతల నుండి తీసుకున్న వివరాల ప్రకారం కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం నుండి ఏకంగా వెయ్యి కార్లు, 250 బస్సులను ఏర్పాటు చేసి వేలాది మందిని మోదీ సభకు తరలించాలని నిర్ణయించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ సభకు జన సమీకరణ విషయంలో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం అగ్రస్థానంలో నిలిచేలా జనాన్ని సమీకరించాలని సూచించారు.

# కేంద్ర నిధులు మళ్లించడం అన్యాయం..

### ఎంపిడిఒ కార్యాలయంలో .. సర్పంచ్‌ల బైఠాయింపు



**ప్రజాపక్షం/ఎడపల్లి:** పల్లె సీమలే దేశానికి వెన్నుముక అని మాజీ ప్రధాని అటల్ బిహారి వాజపేయి చెప్పిన మాటలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తుందని నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం ద్వారా గ్రామ పంచాయతీలకు కేటాయించిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేయడంపై వారు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచులు కలిసి ఎడపల్లి ఎంపీడీఓ కు వినతి పత్రం అందచేశారు. అనంతరం తమ నిరసనను తెలియచేస్తూ ఎంపీడీవో చాంబర్‌లోనే నేలపై కూర్చొని బైఠాయించారు. పంచాయతీలకు రావాల్సిన నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నేరుగా పంచాయతీల ఖాతాల్లో వేసిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు మళ్లించడం వల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు కుంటుపడుతున్నాయని సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో తాము ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, వడ్డీలు కట్టలేక సతమతమవుతున్నామని వారు పేర్కొన్నారు. నిధుల కొరత వల్ల గ్రామాల్లో పారిశుద్ధ్యం, వీధి దీపాలు తాగునీటి సరఫరా వంటి కనీస సౌకర్యాల నిర్వహణ కష్టంగా మారిందని ఆరోపించారు. కేంద్రం ఇచ్చిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పంచాయతీలను నిర్వీర్యం చేయడం మానుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని పలువురు సర్పంచులు పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు రాంచందర్, సత్యం, మంగ్యా, సుండు కిషన్, హన్మంతు, ఉప సర్పంచ్ ఇమ్రాన్, నాయకులు సుమన్, గెంటే శ్రీనివాస్ పాల్గొన్నారు.

# కరీంనగలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నిర్వహణ

### గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్

**ప్రజాపక్షం/కరీంనగర్:** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గణాంక శాఖ ఆధ్వర్యంలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కరీంనగర్ గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ సర్వే నిర్వహించారు. కరీంనగర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గారిని తన కార్యాలయంలో కలిసి సర్వే కరపత్రాలను అందించి సర్వే ప్రాముఖ్యతను వివరించారు. జాతీయ గణాంక శాఖ 2026వ సంవత్సరానికి గాను ప్రజల ఉపాధి స్థితిగతులపై పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే కరీంనగర్లో సర్వే చేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పట్టణాలను, గ్రామాలను ఎంపిక చేసుకుని ప్రజల ఉపాధి స్థితిగతులపై సర్వేలో మొదట సాధారణ వివరాలతో సర్వే చేసిన,అనంతరం మొబైల్ ట్యాబ్ ద్వారా గ్రామంలోని కొన్ని కుటుంబాలను ఎంపిక చేసి మూడు నెలల పాటు నెలకు ఒకసారి పూర్తి సర్వే చేసి ప్రత్యేక ట్యాబ్లో వివరాలు నమోదు చేస్తామని తెలిపారు. తొలి విడతలో కుటుంబ యజమాని పేరు,సభ్యులు వారి విద్యా అర్హతల గురించి, చదువు మానేసిన,ఉన్నత చదువులు,వృత్తివిద్య కోర్సులు, ఉద్యోగం, స్వయం ఉపాధి,వివరాలు రోజువారి కూలీ అయితే వారంలో ఏ పని చేశారో,ఎన్ని గంటలు పని చేశారో, ఎంత వేతనం పొందారో వివరాలతో పాటు మహిళలు స్వయం ఉపాధి పొందే వాళ్ళు అయితే వారి ఆదాయ వివరాలను కూడా నమోదు చేసుకుంటామని తెలిపారు. కార్పొరేటర్ గంట శ్రీనివాస్ మున్సిపల్ వార్డ్ ఆఫీసర్ నాగారపు హరికృష్ణ, మున్సిపల్ మెప్మా సెక్షన్ సిబ్బంది ఆర్పీలు రమ్య మరియు కల్పన మున్సిపల్ సిబ్బంది తంగళ్ళపల్లి కళ్యాణ్ మరియు పాల్గొన్నారు.

# మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా బొమ్మ శ్రీరామ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర ప్రభుత్వం పలు రాష్ట్ర కార్పొరేషన్‌లకు చైర్మన్లు, వైస్ చైర్మన్‌లను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు, మాజీ ఆంధ్రప్రదేశ్ హౌస్ ఫడ్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి ని మున్నూరు కాపు కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్‌గా నియమించింది. బొమ్మ శ్రీరామ్ నియమాకం పట్ల కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మున్నూరు కాపు సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేశారు. సామాజిక న్యాయానికి కట్టుబడి బీసీ వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం మున్నూరు కాపు కార్పొరేషన్‌కు సమర్థుడైన నాయకుడిని చైర్మన్‌గా నియమించడం శుభపరిణామమని పలువురు కాంగ్రెస్ నేతలు, మున్నూరు కాపు సంఘం నాయకులు అన్నారు. మున్నూరు కాపు విద్యార్థుల కోసం హాస్టల్ నిర్వహిస్తూ, సామాజిక సేవలో చురుకుగా ఉన్న శ్రీరామ్ చక్రవర్తి గారి నియామకంతో మున్నూరు కాపు కులస్తులకు విద్య, ఉపాధి, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

# రైల్వే ఉద్యోగాల్లో కోతలను వ్యతిరేకిస్తూ ఎఐవైఎఫ్ పోస్ట్‌కార్డు ఉద్యమం

### ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బావండ్ల పల్లి యుగంధర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** భారత రైల్వేలో 2శాతం ఉద్యోగాల కోత (సుమారు 29,608 పోస్టులు) నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ఇప్పటికే ఉన్న మూడు లక్షల ఖాళీలను భర్తీ చేయాలని, పెండింగ్ లో ఉన్న ఆర్ఆర్ బీ పరీక్ష ఫలితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) కరీంనగర్ ఏఐవైఎఫ్ జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో బుధవారం భారీ స్థాయిలో పోస్ట్‌కార్డు ఉద్యమం నిర్వహించారు. జిల్లాలో కోచింగ్ తీసుకుంటున్న ఆర్ఆర్ బీ అభ్యర్థులు , నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని దేశ ప్రధాని మరియు రైల్వే శాఖామంత్రి వేలాది పోస్టుకార్డులు పంపారు. ఈ పోస్టుకార్డుల ద్వారా రైల్వే ఉద్యోగాలపై కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రశ్నిస్తూ తమ ఆందోళనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి యుగంధర్ మాట్లాడుతూ రైల్వేలో మొత్తం 14,80,455 పోస్టులు ఉంటే, ప్రస్తుతం పనిచేస్తున్న సిబ్బంది సుమారు 10 లక్షలు మాత్రమే వున్నారని, ఖాళీలు 34 లక్షల పోస్టులు ఉన్నాయని, రైల్వే బోర్డ్ తీసుకున్న ప్రస్తుత నిర్ణయంతో 2 ఉద్యోగాల కోత (29,608 పోస్టులు) తగ్గుతాయన్నారు. ఇప్పటికే లక్షల సంఖ్యలో ఖాళీలు ఉన్నప్పటికీ వాటిని భర్తీ చేయకుండా, మరోవైపు ఉద్యోగాలను తగ్గించడం యువత భవిష్యత్తుపై నేరుగా దాడి అని ఏఐవైఎఫ్ విమర్శించారు. లక్షల ఖాళీలు ఉన్నప్పుడు నియామకాలు ఎందుకు చేపట్టడం లేదు..? ఆర్ఆర్‌బి పరీక్షల ఫలితాలు ఎందుకు పెండింగ్‌లో ఉన్నాయి, ఉద్యోగాలను పెంచాల్సింది పోయి ఎందుకు తగ్గిస్తున్నారు? ఇది సంస్కరణనా? లేక ఉద్యోగాల నిర్మూలననా? దీనిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. అందుకే ఏఐవైఎఫ్ రైల్వేలోని అన్ని ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని, 2 శాతం ఉద్యోగాల కోత నిర్ణయాన్ని తక్షణమే రద్దు చేయాలని, ఆర్ఆర్‌బి పరీక్షల ఫలితాలను వెంటనే విడుదల చేయాలని, యువతకు శాశ్వత ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ యువజన వ్యతిరేక విధానాలను వెంటనే ఉపసంహరించకపోతే, దేశవ్యాప్తంగా భారీ స్థాయి ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. అందుకే మే 5 నుండి 7 వరకు ప్రధాన మంత్రి రైల్వే మంత్రికి పోస్ట్ కార్డు, ఈ మెయిల్స్ ఉద్యమం, మే 8న హైదరాబాద్ లోని రైల్ నిలయం ముట్టడి నిరసన ధర్నా నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. నగర ఏఐవైఎఫ్ నాయకులు రమేష్ చరణ్, రవి నాయక్, యాదగిరి, మురళి, సంపత్ కుమార్, శ్రావణి, మౌనిక, ప్రియదర్శిని,నాయకులు పాల్గొన్నారు.



# ప్రాణం పోతే కానీ పట్టించుకోరా



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని తెనుగుపల్లి కి వచ్చే దారిలో డి 86/10 L ఎస్సారెస్పీ కాలువ బ్రిడ్జి మీద ఇరువైపులా గోడ నిర్మించాలని తెనుగుపల్లె యువకులు పోస్టర్లతో నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ యువకుడు కలవేన మహేష్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీ నుండి తెనుగుపల్లికి వచ్చే దారిలో కాల్వపై ఇరువైపుల గోడ నిర్మించాలని దీని వలన రాత్రి సమయంలో వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతూ ప్రాణాలను గుప్పెట్లో పెట్టుకొని రావాల్సి వస్తుందని అన్నారు. దీనిపై దృష్టి సారించాలని పలుమార్లు అధికారులకు మరియు పంచాయతీ కార్యదర్శి వినతి పత్రాలు అందజేయడం జరిగిందని అయిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రాణాలు పోతే గాని దీనిని ఎవరు కూడా పట్టించుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా అధికారులు స్పందించి వెంటనే ఇరువైపుల గోడ నిర్మించాలని నిరసన కార్యక్రమం లో కోరారు .నిరసన లో పాల్గొన్న వారు కలవేన శ్రీకాంత్, రఘుపతి ,వెంకటేష్ ,వంశి కోటేష్ ,సుంకరి దుర్గాప్రసాద్, మహేష్ మరియు గ్రామ ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లుల్లో ధాన్యం వేగంగా అన్ లోడింగ్ చేయాలి

### కలెక్టర్ గరిమ అగ్రవాల్

**ప్రజా పక్షం/ బోయినపల్లి / వేములవాడ:** బోయినపల్లి మండలం కొదురుపాక గ్రామం, వేములవాడ అర్బన్ మండలం అనుపురం లోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. ఇప్పటిదాకా ఎంత ధాన్యం వచ్చింది? ఎంత కొనుగోలు చేశారు? రైస్ మిల్లులకు ఎంత తరలించారు? తదితర విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకానికి అనుగుణంగా లారీలు సమకూర్చాలని కాంట్రాక్టర్ ను ఆదేశించారు. రైతులకు వసతులు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. అకాల వర్షాలు కురిసే ప్రమాదం ఉందని, ధాన్యం తడవకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిబంధనలకు అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేయాలని తెలిపారు.హమాలీల సంఖ్య పెంచాలి బోయినపల్లి మండలం జెగ్గారావుపల్లి గ్రామంలోని సుహాస్ రైస్ మిల్లును జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం నిలువలు, అన్ లోడింగ్ ప్రక్రియను పరిశీలించారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ. రైస్ మిల్లర్లు హమాలీల సంఖ్య వెంటనే పెంచాలని, కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వేగంగా అన్ లోడింగ్ వేగంగా చేయించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆన్లైన్ ఎంట్రీని పూర్తి చేయాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరించిన రైతుల ఖాతాల్లో డబ్బులు వేగంగా జమ అయ్యేలా చూడాలని ఆదేశించారు. లారీల ట్రాన్స్పోర్ట్ లు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని ధాన్యం తరలింపులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి ఎల్ బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా సహకార అధికారి రామకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ షరీఫుద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

